
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

పక్కదారి పడుతున్న వంట గ్యాస్





ఆకట్టుకున్న లేజర్ షో.. రావణ దహనం

ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల నిలిపివేత

అక్షరటుడే, మెండోరా: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలకు నీటి విడుదలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. వరద కాలువ ద్వారా పది రోజుల పాటు కొనసాగిన నీటి విడుదలను సైతం ఆపేశారు. వర్షాకాల పంటల సాగు కోసం గత మూడు నెలలుగా కాకతీయ, సరస్వతి, లక్ష్మి కాలువల ద్వారా కొనసాగించిన నీటి సరఫరాకు స్వస్తి పలికారు. ఈ విషయాన్ని ప్రాజెక్టు డీఈ గణేష్ వెల్లడించారు. 80 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన శ్రీరాంసాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 36 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. నీటిని మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో యాసంగిలో ఆయకట్టుకు నీరందించే అవకాశం లేదు.



డిచ్‌పల్లి బెటాలియన్‌లో అమరవీరుల సంస్మరణ దినం

అక్షరటుడే, డిచ్‌పల్లి : డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. దేశ రక్షణలో, శాంతిభద్రతల పరిరక్షణలో విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన వీర జవాన్లకు నివాళులర్పించారు. దేశ ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కమాండెంట్ సీతారాం పేర్కొన్నారు. వారి ధైర్యసాహసాలు, అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, అమరవీరుల త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ, వారు చూపిన మార్గంలో విధి నిర్వహణకు అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నరసింహస్వామి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సత్యశోధక్ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: సిరికొండలోని ఎంఎన్ ఫంక్షన్ హాల్‌లో సత్యశోధక్ పాఠశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సుమారు 13ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల జీవితంలోని మధుర ఘట్టాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ.. 2012-13 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులను ఇన్నేళ్ల తర్వాత తిరిగి కలుసుకోవడం ఎంతో సంతోషాన్ని, తృప్తిని కలిగించిందని భావోద్వేగంగా పేర్కొన్నారు. పాఠశాల దశలో ఏర్పడే స్నేహాలు స్వార్థరహితమైనవని, జీవితంలోని ఒడుదుడుకుల్లోనూ అలాంటి బంధాలు మనసుకు ధైర్యాన్ని, ఆత్మీయతను అందిస్తాయని తెలిపారు. 13 ఏళ్ల జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాలను పంచుకోవడం ద్వారా స్నేహబంధాలు మరింత బలపడతాయన్నారు. ప్రిన్సిపల్ ఆర్. నర్సయ్యతో పాటు పదో తరగతిలో బోధించిన ఉపాధ్యాయులు గంగారెడ్డి, సంతోష్ రెడ్డి, లింగం, నరేందర్, మైఖేల్, ప్రసాద్, అరుణ, సుజాతను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.



మనుగడ కోసం పోరాటం..

- ఉద్యమబాటలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు
- తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న ఆందోళన
- గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు
- నిలిచిపోతున్న మందుల సరఫరా

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. 9 రోజులుగా గ్రామాల్లో వైద్యసేవలు నిలిపివేసిన ఉద్యోగులు తమ భవిష్యత్తు కోసం ఆందోళన బాట పట్టారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మెను ఆపేది లేదని స్పష్టం చేస్తున్నారు.
– అక్షరటుడే, కామారెడ్డి

జాతీయ ఆరోగ్య మిషన్‌లో అత్యంత కీలకంగా పనిచేస్తున్న సిబ్బంది ఒక్కసారిగా ఆందోళన బాటపట్టారు. గతంలో విడతల వారిగా తమ నిరసనను తెలిపిన ఉద్యోగులు ప్రస్తుతం నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. అక్టోబర్ 13 నుంచి జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో 539 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొంటున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్యసేవలు నిలిచిపోతున్నాయి. దీంతో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్న ప్రచారం సాగుతోంది.

డిమాండ్లు పరిష్కరించే వరకు..

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మెను ఆపేది లేదని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తేల్చి చెప్తున్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నట్లు పేర్కొంటున్నారు. ప్రభుత్వం పరిష్కరించే డిమాండ్లను మాత్రమే తాము అడుగుతున్నట్లు ఉద్యోగులు తెలిపారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొంటుంది. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. మహిళలకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ఉద్యోగులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరుతున్నారు. తమ కుటుంబాల భవిష్యత్తు కోసం, ఉద్యోగ భద్రత కోసం చేస్తున్న ఈ పోరాటానికి ప్రజలు కూడా మద్దతు తెలిపాలని కోరుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు

ఒక్కో పీహెచ్‌సీలో ముగ్గురి నుంచి నలుగురు చొప్పున పని చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది ధర్నాలో పాల్గొనడంతో ఓపీ సేవలు నిలిచిపోయాయి. చిన్నపిల్లలకు ఇవ్వాల్సిన వ్యాక్సినేషన్ నిలిచిపోతున్న పరిస్థితి నెలకొంది. గర్భిణులకు, బాలింతలకు సేవలు కూడా అందట్లేదు. టీబీ పేషంట్లకు ప్రతినెలా ఇవ్వాల్సిన మందులు చేరట్లేదు. టీబీ మందులు ఆపితే వ్యాధి మళ్లీ తిరగబెడుతుందని రోగులు భయపడుతున్నారు. షుగర్, బీపీ పేషంట్లు మందులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, వైద్య సేవలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సమాన వేతనం ఇవ్వాలి..

- స్వాతి, డేటా ఎంట్రీ ఆపరేటర్



సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. జీతాలు సరిగా లేక కుటుంబ సభ్యులను పోషించుకోలేకపోతున్నాం. ఇది నా ఒక్క సమస్య కాదు. నాలాంటి వాళ్లు అనేక మంది ఉన్నారు. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి న్యాయం చేయాలి.

అన్ని పనులు చేస్తున్నా ప్రోత్సాహం లేదు

- డా. వేణుమాధవ్, ఎంఎల్‌హెచ్‌పీ



పీహెచ్‌సీల్లో చేయాల్సిన ప్రతిపని పల్లె దవాఖానలో చేయాల్సి ఉంటుంది. పీహెచ్‌సీల్లో ప్రతిపనికి ఒక ఉద్యోగి ఉంటారు. ఇక్కడ మాత్రం ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ అన్ని మేమే చేసుకోవాల్సి వస్తుంది. నాలుగేళ్లుగా ప్రోత్సాహం మాత్రం లేదు. ఇస్తున్న వేతనం పెరగడం లేదు కానీ పనులు మాత్రం రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి.

రెగ్యులరైజ్ చేయాలి..

- ప్రభాకర్, కాంటింజెంట్



పాతికేళ్లుగా కాంటింజెంట్‌గా పని చేస్తున్న. రూ.9,200 మాత్రమే వేతనం వస్తోంది. చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్న మా పరిస్థితులు మాత్రం మారడం లేదు. ప్రభుత్వం మమ్మల్ని రెగ్యులరైజ్ చేయాలి.



23న జిల్లా మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో 'దసరా సమ్మేళనం'

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లా మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో 'దసరా సమ్మేళనం' నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని ఆయన నివాసంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘం కళ్యాణ మండపంలో దసరా సమ్మేళనం జరుగనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతిఒక్క మున్నూరుకాపు కులస్తులు కుటుంబాలతో కలిసి హాజరుకావాలని సూచించారు. మున్నూరుకాపు ప్రజాప్రతినిధులకు సైతం ఆహ్వానించామన్నారు. మహిళలు, పురుషులు, చిన్నారులకు ప్రత్యేకంగా ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



కేటీఆర్, హరీష్‌రావులకు శుభాకాంక్షలు తెలిపిన బిగాల

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులకు అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాద్‌లో వారిరువురిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

అక్షరటుడే, కామారెడ్డి: విధి నిర్వహణలో పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పోలీస్ కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద ఎస్పీ రాజేష్ చంద్రతో కలిసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల స్ఫూర్తి, విలువలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని తెలిపారు. సమాజ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందాలంటే శాంతిభద్రతలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు, దేశ అంతర్గత భద్రతలో పోలీసులు తమ అమూల్యమైన ప్రాణాలను సైతం త్యాగం చేస్తూ ప్రజల రక్షణకు అంకితమవుతున్నారని తెలిపారు. అటువంటి మహనీయులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని అన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారు భవిష్యత్తులో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ఏవైనా సమస్యలు ఉంటే ఏ సమయంలోనైనా తనను వచ్చి కలవవచ్చని, వెంటనే వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ దేశం కోసం, రాష్ట్రం కోసం విధి నిర్వహణలో తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరులను స్మరించుకునే రోజు అక్టోబర్ 21 అని తెలిపారు. ఆ మహనీయుల జ్ఞాపకార్థం ప్రతి ఏడాది పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. జవానులు, పోలీసులు విధి నిర్వహణలో కర్తవ్యానికి ప్రాధాన్యమిస్తూ దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా అసాంఘిక శక్తులను ఎదుర్కొంటూ 154 మంది పోలీసు సిబ్బంది వీరమరణం పొందగా, తెలంగాణ రాష్ట్రం నుంచి నలుగురు అమరులయ్యారని తెలిపారు. కామారెడ్డి జిల్లా నుంచి ఇప్పటివరకు ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీలు మధుసూదన్, విఠల్ రెడ్డి, శ్రీనివాసరావు, గట్టుమల్లు, ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.



పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి : కలెక్టర్, సీపీ

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీ సాయిచైతన్య అన్నారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో కలిసి కలెక్టర్ పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. విధి నిర్వహణలో భాగంగా సంఘ విద్రోహశక్తులతో పోరాడుతూ, అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి కుటుంబాల త్యాగాలను గుర్తించడం ప్రతిఒక్కరి కనీస బాధ్యత అని గుర్తుచేశారు. గతేడాది జిల్లాకేంద్రంలో అసాంఘిక శక్తుల చేతిలో ప్రమోద్ కుమార్ అనే సీసీఎస్ కానిస్టేబుల్ వీర మరణం పొందారని గుర్తు చేశారు. పోలీసు అమరుల కుటుంబాలకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పోలీస్ కమిషనర్ సాయిచైతన్య మాట్లాడుతూ, ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులు అమరులయ్యారని అన్నారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 1986 నుండి ఇప్పటివరకు 21 మంది పోలీసులు అసాంఘిక శక్తులతో పోరాడుతూ అసువులు బాశారని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా తమ కర్తవ్య నిర్వహణలో ఎల్లవేళలా పోలీసులు ముందంజలో నిలుస్తున్నారని అన్నారు. అమరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా చేదోడువాదోడుగా ఉంటుందని భరోసా కల్పించారు. ఇప్పటికే 11 మందికి ఇంటిస్థలాలు కేటాయించామని, మిగతా పది కుటుంబాలకు వారు కోరిన మేరకు కామారెడ్డి, మాక్లూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థలాలు కేటాయించేలా రెవెన్యూ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. అమరుల కుటుంబాలు తమ సాధకబాధకాలు తెలియజేసేందుకు వరుసలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక అధికారిని నియమిస్తామని తెలిపారు. జిల్లాలో విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబీకులకు జ్ఞాపికలు అందజేశారు. అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ఏసీపీ (ఏఆర్) కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మానిక్ భవన్‌లో దసరా 'అలాయ్ బలాయ్'



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని నూతన వైశ్య ఉన్నత పాఠశాల (మానిక్ భవన్)లో 1988-89లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు దసరా 'అలయ్ బలయ్' నిర్వహించారు. బుధవారం యువమిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపారు. నిజామాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో ఉన్న 37 మంది బాల్యమిత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల్యమిత్రులు దసరా బంగారం ఇచ్చిపుచ్చుకొని ఆత్మీయ ఆలింగనం చేసుకొని దసరా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మిత్రులందరూ విద్యాభ్యాసం సమయం నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ప్రతి ఏడాది దసరా మరుసటి రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని ఈ సందర్భంగా యువమిత్ర యువజన సంఘం అధ్యక్షుడు యంసాని రవీందర్ తెలిపారు. స్నేహితుల్లో ఎవరికైనా ఆర్థిక ఆరోగ్య ఇబ్బందులు ఉంటే అందరూ కలిసి మాట్లాడుకొని వారి సమస్యను తీర్చడానికి కృషి చేస్తున్నామన్నారు. సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బుద్దాయి రాజు, ప్రధాన కార్యదర్శి చింతల గంగాదాస్, కోశాధికారి మూడ వెంకటేష్, కార్యక్రమ చైర్మన్ వారణాసి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనం



అక్షరటుడే, మాక్లూర్: తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు అందుకున్న దుర్గామాత నిమజ్జనం బుధవారం ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఉదయం నుంచే ఊరేగింపుగా ముందుకు సాగుతూ భక్తి తన్మయత్వంలో మునిగిపోయారు. భవానీ దీక్షాపరులు, భజన భక్తులు అమ్మవారి రథం ముందు భక్తిపాటలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. అమ్మవారికి భక్తి పారవశ్యంతో వీడ్కోలు పలికేందుకు డప్పు వాయిద్యాలు, భక్తుల నడుమ మహిళల మంగళ హారతులతో శోభాయాత్ర నిర్వహించారు. వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా అని వేడుకున్నారు. అప్పటివరకు తమ కుటుంబాలతో పాటు గ్రామాన్ని సుభిక్షంగా ఉంచాలని ప్రార్థిస్తూ నిమజ్జనం పూర్తిచేశారు.

గృహావసరాలకు కేటాయించిన రాయితీ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. ఏజెన్సీల నిర్వాహకులు తమ అక్రమ సంపాదనే ధ్యేయంగా డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు.
- అక్షరటుడే, ఇందూరు



పక్కదారి పడుతున్న వంటగ్యాస్..

■ జిల్లాలో దర్జాగా డొమెస్టిక్ గ్యాస్ అక్రమాలు ■ వాణిజ్య అవసరాలకు మరలుతున్న సిలిండర్లు ■ వ్యాపారులకు రెట్టింపు ధరలకు అమ్మకాలు ■ అధికారుల పర్యవేక్షణ అవసరమంటున్న ప్రజలు

జిల్లాలో వంటగ్యాస్ పక్కదారి పట్టడంపై సంబంధిత సివిల్ సప్లయ్ శాఖ అధికారులు పర్యవేక్షణ లోపించిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వాణిజ్య అవసరాలకు ఎక్కువగా డొమెస్టిక్ సిలిండర్లు వెళ్తుండడంతో గృహ వినియోగదారులు సకాలంలో సిలిండర్లు అందక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

జిల్లాలో గ్యాస్ వివరాలివి

నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా 73 గ్యాస్ ఏజెన్సీలు (ఇండేన్, భారత్‌గ్యాస్, హెచ్‌పీ) ఉన్నాయి. మొత్తంగా ఏడు లక్షలకు పైగా డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాంటిన్లు, ఇతర వ్యాపార అవసరాల నిమిత్తం జిల్లాలో 3,400 కంటే ఎక్కువ కమర్షియల్ సిలిండర్ కనెక్షన్లు ఉన్నట్లు సిలిల్ సప్లయ్ రికార్డులు చూపుతున్నాయి.

నిబంధనలు పక్కకుపెట్టి..

నిబంధనల ప్రకారం హోటళ్లు, రెస్టారెంట్లు, అల్పాహార దుకాణాల్లో కేవలం వాణిజ్య(కమర్షియల్) సిలిండర్లు మాత్రమే వినియోగించాల్సి ఉంది. అయితే డొమెస్టిక్ సిలిండర్ రూ.1,010 ఉండగా.. వాణిజ్య సిలిండర్ ఏకంగా రూ.3,050 వరకు ఉంది. దీంతో ఈ వ్యత్యాసాన్ని గ్యాస్ ఏజెన్సీలు సొమ్ము చేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పలుచోట్ల పేదల పేరుతో ముందస్తుగా గ్యాస్ బుకింగ్ చేసి.. ఆ సిలిండర్లను వ్యాపారులకు రూ.1,400.. ఆపైగా డబ్బులకు విక్రయిస్తున్నట్లుగా సమాచారం.

గుప్‌చుప్‌గా రిఫిల్లింగ్ దందా..

మరోవైపు చిన్న సిలిండర్లలో గ్యాస్ నింపేందుకు కూడా ఈ డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. పేద కుటుంబాలు రెండు, మూడు నెలలకొకసారి సిలిండర్ బుక్ చేసుకుంటారు. అయితే వారి పేరుతో నెలనెలా సిలిండర్ బుక్ చేయించి వారి డెలివరీ అయ్యే సిలిండర్లను ఇతరులకు అప్పజెప్తూ ఏజెన్సీ నిర్వాహకులు, డెలివరీ బాయ్‌లు సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. అలాగే చిన్న సిలిండర్లలో గ్యాస్ నింపేందుకు కిలోకు రూ.210 వసూలు చేస్తున్నారు. నగరంలోని వినాయక్‌నగర్, పెద్దపోస్టాఫీస్ తదితర ప్రాంతాల్లో బహిరంగంగానే ఈ తతంగం జరుగుతున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారని ప్రజలు పేర్కొంటున్నారు.

ఎప్పుడోగాని తనిఖీలు..

సిలిండర్లు పక్కదారి పడుతున్న పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు రాగానే చిన్న హోటళ్లు, రోడ్డుపక్కన బండ్లమీద దాడు లు చేసి సిలిండర్లను సీజ్ చేస్తున్నారని.. పెద్ద వ్యాపార సంస్థల్లో దర్జాగా సిలిండర్లు వాడుతున్నా పట్టించుకోవట్లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పక్క దారి పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా అలయ్.. బలయ్



అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని మీనాక్షి ఫంక్షన్ హాల్‌లో బుధవారం దసరాను పురస్కరించుకొని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అన్వేష్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాతల ఆలయ్‌బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో సాగుచేస్తున్న మహిళా రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలను ఆకట్టుకున్నాయి. సీపీ సాయి చైతన్య, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహర్ బిన్ హందాన్, మునిపల్లి సాయిరెడ్డి, ప్రభాకర్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నరాల సుధాకర్‌కు ఘన సన్మానం



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా నరాల సుధాకర్ ఎన్నికయ్యారు. ఆయనను బుధవారం నాళేశ్వర్ వాసులు ఘనంగా సన్మానించారు. తమ గ్రామానికి చెందిన నరాల సుధాకర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించడం తమకు గర్వకారణమన్నారు. ఆయన మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. నాళేశ్వర్ ఉప సర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్, బినోల సొసైటీ మాజీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు, ఆర్మూర్ గణేష్, కుమ్మరి సంజీవ్, ద్యాగ లింగారెడ్డి, భూమయ్య, సురేష్ తదితరులు ఉన్నారు.

హన్మంత్ రావును కలిసిన మందాపూర్ గ్రామస్తులు



అక్షరటుడే, మాక్లూర్ : మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హన్మంత్ రావును మందాపూర్ గ్రామస్తులు బుధవారం కలిశారు. జన్నపల్లి వద్ద ఉన్న ఆయన గెస్ట్ హౌస్‌లో జనవికాస్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి అధ్వర్యంలో ఆ గ్రామ రామాలయ కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన రామాలయ నిర్మాణం గురించి ఆయనతో మాట్లాడారు. దేవాదాయ శాఖ కార్యాలయం నుంచి రావాల్సిన మంజూరు అనుమతులు ఆలస్యం అవుతుందని మైనంపల్లి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన రాష్ట్ర దేవాదాయ శాఖ కమీషనర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. రామాలయ నిర్మాణం పూర్తయ్యేవరకు నిధుల మంజూరు విషయంలో తన పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

ఆకట్టుకున్న లేజర్ షో.. రావణ దహనం



అక్షరటుడే, కామారెడ్డి: ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాలకు విశేష స్పందన లభించింది. కామారెడ్డి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జనాలు భారీగా తరలివచ్చి ఉత్సవాలను వీక్షించి హర్షం వ్యక్తం చేశారు. ఇందిరాగాంధీ స్టేడియంలో దసరా పండుగ సందర్భంగా షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవాల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రావణ దహన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, ప్రముఖ వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. స్టేడియం మొత్తం జనంతో కిక్కిరిసిపోయింది. ముందుగా నిర్వహించిన లేజర్ షో ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది.

డీజే అనుమతి కోసం గ్రామస్తుల ధర్నా

అక్షరటుడే, గాంధారి : దుర్గాదేవి శరన్నవరాత్రులు ముగిసిన సందర్భంగా మండల కేంద్రంలో దుర్గామాత విగ్రహంతో స్వాములు, గ్రామస్తులు శోభాయాత్ర నిర్వహించారు. అయితే యాత్రలో భాగంగా పోలీసులు డీజేకు అనుమతి ఇవ్వలేదు. దీంతో గ్రామస్తులు రోడ్డుపై ధర్నాకు దిగారు. యాత్ర సందర్భంగా డీజేకు అనుమతివ్వాలని పోలీసులను గ్రామస్తులు కోరగా పోలీసులు నిరాకరించారు. చిన్నబాక్స్‌కు మాత్రమే ఎస్సై మహేందర్ అనుమతించారు. కాని గ్రామస్తులు డీజే కావాలని పట్టుబట్టి ధర్నాకు దిగడంతో సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జాం అయింది. భక్తులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.









అంబరాన్నంటిన దసరా సంబురం

ఉమ్మడిజిల్లాలో దసరా సంబరం అంబరాన్ని అంటింది. బుధవారం సాయంత్రం వేళ నగరంలోని నాగారం వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయం, కంఠేశ్వర్ ఆలయం, వినాయక్‌నగర్‌లోని మహాలక్ష్మి ఆలయాలను భక్తులు సందర్శించారు. దసరా బంగారం ఒకరికొకరు ఇచ్చుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే కామారెడ్డి పట్టణంలో దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన లేజర్ షో, రావణదహన కార్యక్రమాలు హైలెట్‌గా నిలిచాయి. ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో రావణ దహనం చేశారు. పోతంగల్ మండలంలో జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు జరిగాయి. పలుచోట్ల అలయ్ బలయ్ కార్యక్రమాలు నిర్వహించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్





